క్లుప్తంగా

పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతు పనులు చేయిస్తున్న అధికారులు

దోమ: మండల కేంద్రంలో పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు అధికారులు మరమ్మతులు చేయించారు. గురువారం సాక్షి దిన పత్రికలో పైపు పగిలి..నీరంతా వృథా అనే కథనం ప్రచురితం కావడంతో ఎట్టకేలకు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు సిబ్బందితో మరమ్మతు పనులు చేయించి ప్రజల ఇబ్బందులను తొలగించారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు సంస్కారం అవసరం



మోడల్ స్కూల్లో లెక్చరర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పూడూరు: పాఠశాల విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం అవసరమని లెక్చరర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మోడల్ స్కూల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణలో భాగంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ క్రమశిక్షణతో పాటు సంస్కారం ఉండాలని, లేకపోతే సమాజంలో గుర్తించబడరన్నారు. విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ సాయిరెడ్డి, సెక్టోరియల్ అధికారి రమేశ్, ఆర్పీలు వెంకటయ్య, లాలయ్య, బాల్‌రాజ్, ఉపాధ్యాయులు కమాల్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, వెంకటేశం, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాలు వచ్చేశాయ్



ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను అందిస్తున్న సీఆర్పీలు

కుల్కచర్ల: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్. గురువారం కుల్కచర్ల మండల పరిధిలో ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు సీఆర్పీలు ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో బడులకు తరలించారు. పాఠశాలలు ప్రారంభం కాక ముందే పుస్తకాలు రావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఆర్పీలు గాంగ్యానాయక్, రాజు, రమేశ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న కొమ్మల తొలగింపు



విద్యుత్ వైర్లకు అడ్డు ఉన్న చెట్ల కొమ్మలను తొలగించిన సిబ్బంది

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌లో విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను గురువారం తొలగించారు. వారం రోజులుగా వర్షాలు, ఈదురు గాలులు వీస్తుండడంతో చెట్ల కొమ్మలు వైర్లకు తాకి మంటలు వస్తున్నాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుర్తించిన అధికారులు లైన్‌మెన్ వెంకట్‌రాములు సహకారంతో వాటిని తొలగించారు. ఉదయం దాదాపు 4 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపేసి విద్యుత్‌లైన్ క్లియర్ చేశారు.

పంపిణీకి సిద్ధం

బంట్వారం: సహకార సంఘం గోదాంలో జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏఓ శ్రావ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీల బస్తా 50 శాతం సబ్సిడీతో రూ.2,137కు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 10 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. డిమాండ్‌ను బట్టి మళ్లీ తెప్పిస్తామని పేర్కొన్నారు. అవసరమైన రైతులు పట్టాపాసు బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలను వెంట తీసుకొని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపు!



రేషన్ కార్డులు, సంక్షేమ పథకాల కోసం దుద్యాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సమావేశం (ఫైల్)

- దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా జాడలేని రేషన్ కార్డులు
- తహసీల్దార్ కార్యాలయంలో కరువైన సేవలు
- పేరు చేర్చాలన్నా, తొలగించాలన్నా పాత మండలానికి వెళ్లాల్సిందే
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: కొన్ని సంవత్సరాలుగా రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా పెళ్లైనా, సంతానం కలిగినా వారి వివరాలు నేటికి నమోదు కాకపోవడం విడ్డూరంగా ఉందని వాపోతున్నారు. ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల్లో పేర్ల నమోదుకు అవకాశం కల్పించింది. అందుకుగాను అర్హులు దరఖాస్తు చేసుకుని దాదాపు రెండు నెలలు గడుస్తున్నా నేటికి నమోదు చేయకపోవడం బాధాకరం. రేషన్ కార్డుల్లో పేర్లులేని కారణంగా కొన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులవుతున్నారని చెబుతున్నారు. మరణించిన వారి పేరు తొలగించినంత వేగంగా కొత్త వారి పేర్ల నమోదు ఎందుకు చేపట్టలేకపోతున్నారోనని ప్రశ్నిస్తున్నారు.

తప్పని ఎదురు చూపు

ప్రభుత్వం నూతన రేషన్ కార్డులకోసం రెండు నెలల క్రితం గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. వాటిలో మార్పులు, చేర్పులు, నూతన కార్డులకోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. తీసుకున్న దరఖాస్తుల పురోగతి మాత్రం కనిపించడంలేదు.

సేవలు అందుబాటులో లేక సమస్యలు

రేషన్ సర్వీసులకు సంబంధించి లాగిన్ ఐడీ దుద్యాల్ తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో పాత మండలానికే వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఇవ్వడంతో రెవెన్యూ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. కానీ ఇక్కడ సేవలు అందుబాటులో లేకపోవడంతో బొంరాస్‌పేట్‌కు వెళ్లాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరు నమోదు కాలేదు



పెళ్లై ఎనిమిదేళ్లు గడుస్తున్నా రేషన్ కార్డులో పేరు నమోదు కాలేదు. కుటుంబ సభ్యులతో పాటు నా పేరు నమోదు చేయాలని దరఖాస్తు చేసుకుని రెండు నెలలు గడుస్తున్నా ఎలాంటి ఫలితం లేదు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే సంక్షేమ పథకాలకు దూరమయ్యాం.

– అనూష, గృహిణి, దుద్యాల్

ఉపాధిహామీ పథకం కూలీలకు వరం

కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్



మట్టి రోడ్డు వేస్తున్న కూలీలు

కుల్కచర్ల: ఉపాధిహామీ పనులు కూలీలకు వరమని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మక్తవెంకటాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా మక్తవెంకటాపూర్ నుంచి కొత్తపల్లి తండా వరకు పొలాలను అనుసంధానిస్తూ మట్టిరోడ్డు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు రోజువారి ఉపాధి లభించడంతో పాటు రైతాంగానికి ఉపయోగకరమైన పనులు చేపడుతున్నారన్నారు. రైతుల పొలాలకు అనుసంధానంగా మట్టి రోడ్డు వేయడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అంజునాయక్, హన్మంతు, సూర్యనాయక్, హర్యనాయక్, రామారావు, రాంజీ, అమలానాయక్, లాలు, ప్రసాద్, సంతోష్, గాంధీ, మోహన్, కురుమయ్య, రెడ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చి రొట్ట ఎరువులతో భూసారం పెంపు

- మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి
- సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



జీలుగ విత్తనాలను అందిస్తున్న మహేందర్‌రెడ్డి

మోమిన్ పేట: పచ్చి రొట్ట ఎరువులతో భూసారం పెరిగి భూమి గుల్లగా మారుతుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడకుండా పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము తదితర విత్తనాలను ఉపయోగించుకోవాలన్నారు. విత్తిన 40 రోజులకు కలియదున్నాలని ఆయన సూచించారు. దీంతో భూసారం పెరిగి భూమి గుల్లగా తయారవుతుందన్నారు. భూక్షారం తగ్గించడంలో సేంద్రియ ఎరువులు ఎంతో ఉపయోగపడుతాయని ఆయన వివరించారు. రసాయనిక ఎరువులను విరివిగా వాడడం వల్ల భూసారం తగ్గి దిగుబడులు తగ్గుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో జయశంకర్, ఏఈఓ పెంటయ్య, నాయకులు విట్టల్, విజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి తరలించొద్దు

కుల్కచర్ల ఎస్ఐ రమేశ్



కూలీలకు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేశ్

కుల్కచర్ల: పరిమితికి మించి కూలీలను ఆటోల్లో తరలించొద్దని కుల్కచర్ల ఎస్ఐ రమేశ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలతో వెళ్తున్న ఆటోను ఆపి ఆటో డ్రైవర్, కూలీలకు అవగాహన కల్పించారు. పరిమితికి మించి ఆటోల్లో ఎక్కించుకుంటే ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. ఒకే ప్రాంతానికి ఎక్కువమంది కూలీలు వెళ్లాల్సిన సందర్భంలో ఎక్కువమందిని ఎక్కించుకుంటున్నారన్నారు. రోడ్డు భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపినా, మితిమీరిన వేగంతో నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విత్తనాలను సకాలంలో అందించాలి



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో వీరస్వామి

మండల వ్యవసాయాధికారి వీరస్వామి

కుల్కచర్ల: రైతులకు ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించాలని మండల వ్యవసాయాధికారి వీరస్వామి పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంలో ఎలాంటి తప్పుడు విధానాలను అవలంభించొదన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఎలాంటి రసాయనిక ఎరువులను అమ్మొద్దన్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూమిలో హెచ్చరికబోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

అనంతగిరి: ప్రభుత్వ భూముల్లో లావాదేవీలు చేసినా, నిర్మాణాలు చేపట్టినా చట్టపర చర్యలు తప్పవని మండల తహసీల్దార్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేశ్ సిబ్బందితో కలిసి పులుసుమామిడి, పీరంపల్లి గ్రామ పరిధిలోని సర్వేనంబర్లు 129, 149, 70లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఈ భూముల్లో నిర్మాణాలు చేయడం, కొనుగోలు, అమ్మకాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మఠం కౌలు వేలం ఆదాయం రూ.9,69,000



తిమ్మారెడ్డిపల్లిలో వేలం నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

నవాబుపేట: శ్రీ నంబి గురుస్వామి మఠానికి చెందిన 60.14 ఎకరాల భూమికి కౌలు వేలం ద్వారా వచ్చిన ఆదాయం రూ.9,69,000లని ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని చిట్టిగిద్ద రెవెన్యూలోని తిమ్మారెడ్డి పాలెం గ్రామంలో శ్రీ నంబి గురుస్వామి మఠం 60.14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని నంబి గురుస్వామి మఠం వద్ద గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన ఐదుగురు రైతులు మూడు సంవత్సరాల కౌలు కోసం వేలంలో దక్కించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఈజీ ప్రణీత్ కుమార్, శ్రీ నంబిగురు స్వామి మఠం కార్యనిర్వాహణాధికారి శాంత్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం నాటికి యూనిఫాంల అందజేత

మండల విద్యాధికారి వెంకట్



మాట్లాడుతున్న మండల విద్యాధికారి వెంకట్

దోమ: పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థుల యూనిఫాంలు అందజేయాలని ఐకేపీ సిబ్బందికి మండల విద్యాధికారి వెంకట్ సూచించారు. గురువారం దోమ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో మండల అధ్యక్షురాలు అనసూజ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమయ్యేందుకు సమయం దగ్గరకు వస్తుందని, విద్యార్థుల యూనిఫాంలు త్వరితగతిన కుట్టి అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో నిర్లక్ష్యరాస్యులను గుర్తించి వారికి వయోజన విద్య అందించేందుకు కృషి చేయాలన్నారు. పదోతరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి ఓపెన్ స్కూల్, ఓపెన్ ఇంటర్‌లో చేర్పించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సమాఖ్య సభ్యులు, సీసీలు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

బంట్వారం: క్షయపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మేఘన పేర్కొన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గురువారం కరీంపూర్ పీహెచ్‌సీ పరిధిలోని బార్వాద్ సబ్‌సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. రక్తపోటు, హెచ్ఐవీ, టీబీ, మధుమేహం, ఆల్కహాల్, ధూమపానం తదితర అంశాలను ఆమె వివరించారు. టీబీ లక్షణాలున్న పలువురిని గుర్తించి ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేయించారు. వ్యాధికి గురైన వారికి ఆరు నెలల వరకు ఉచిత మందులతో పాటు నెలకు రూ.వెయ్యి ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ నివారణ అధికారి రవీంద్రయాదవ్, హెచ్ఈఓ రవీందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది అశోక్, నరేందర్, ప్రభావతి, ఆశావర్కర్లు ఈశ్వరమ్మ, లక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సబ్సిడీపై విత్తనాల పంపిణీ

యాలాల: సబ్సిడీపై అందిచనున్న జీలుగ విత్తనాలను శుక్రవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి శ్వేతరాణి తెలిపారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రంలో విత్తనాల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. 50శాతం సబ్సిడీపై 30 కేజీల బస్తాకు రూ.2,135లను చెల్లించి తీసుకోవాలని తెలిపారు. విత్తనాలు అవసరమనుకున్న రైతులు తమ క్లస్టర్‌కు చెందిన ఏఈఓల నుంచి పర్మిట్ తీసుకోవాలని సూచించారు.

ఇన్సూరెన్స్ కల్పించాలి

బంట్వారం: మహిళా సమాఖ్య సంఘంలో విధులు నిర్వహించే వీవోఏలకు రూ.10లక్షల ఇన్సూరెన్స్ భద్రత కల్పించాలని వీవోఏల సంఘం కోట్‌పల్లి మండల అధ్యక్షుడు దేవయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లింగంపల్లి గ్రామ సంఘంలో వీవోఏగా పని చేసే ఎర్రగొల్ల రాధిక అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా అంత్యక్రియల నిమిత్తం వీవోఏల సంఘం తరఫున రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం దేవయ్య మాట్లాడుతూ కేవలం రూ.5వేల గౌరవ వేతనంతో వీఓఏలు ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ పాలకులు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

అర్హులకు ఇళ్ల మంజూరు



చెంచుల వివరాలను సేకరిస్తున్న కార్యదర్శులు కరుణాకర్ రెడ్డి, సంతోశ్

కుల్కచర్ల: అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తామని పంచాయతీ కార్యదర్శులు కరుణాకర్ రెడ్డి, సంతోశ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం రాంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో చెంచులకు మంజూరైన ఇళ్ల లబ్ధిదారుల నివాస ప్రాంతాలకు వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పీఎం జన్మాన్ పథకంలో భాగంగా వెనుకబాటుకు గురైన చెంచుల అభ్యున్నతికి ప్రత్యేకంగా ఇళ్లను మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు విద్యారంగంలో రాణించాలి



అభినందిస్తున్న నాయకులు

ప్రజా సంఘాల నాయకులు

బొంరాస్‌పేట: బహుజనులు విద్యారంగంలో రాణించాలని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రేగడిమైలారంలో జగ్జీవని అనే గురుకుల విద్యార్థిని ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయంలో నాలుగేళ్ల పాటు చదివేందుకు నిర్వహించిన పరీక్షలో మంచి మార్కులు సాధించి ప్రవేశం పొందింది. వందశాతం రాయితీతో ఉచితంగా చదువుకునే అవకాశం దక్కడంతో ప్రజాసంఘాల నాయకులు విద్యార్థినిని శాలువా కప్పి సన్మానించి కుటుంబ సభ్యులను అభినందించారు. మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ ప్రజాసంఘాల తాలుకా అధ్యక్షుడు రమేశ్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం నాయకులు కొత్తురు చంద్రయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, బాలరాజు, సాయిలు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఐ అశోక్‌రెడ్డికి ఘన వీడ్కోలు

అనంతగిరి: ఉద్యోగ విరమణ పొందిన ఆర్ఎస్ఐ బి అశోక్‌రెడ్డి సుదీర్ఘ సేవలను, అంకితభావాన్ని, క్రమశిక్షణను జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి కొనియాడారు. గురువారం వికారాబాద్ ఎస్పీ హెడ్‌క్వార్టర్‌లో ఆర్ఎస్ఐ అశోక్‌రెడ్డి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి, హెడ్‌కానిస్టేబుల్, ఏఆర్ఎస్ఐగా, ఏఎస్ఐగా పదోన్నతులు పొందారన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరన్నారు. సర్వీసులో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అశోక్‌రెడ్డి 40 ఏళ్ల సర్వీసు యువ సిబ్బందికి స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం శాలువా కప్పి, పూలమాల వేసి జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఏఓ జ్యోతిర్మణి, ఆర్ఐలు, పోలీస్‌ప్రెసిడెంట్ అశోక్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుతో ఆందోళన!



ఎన్కేపల్లిలో పొలంలో పెరిగిన కలుపు

- పొలాలను సిద్ధం చేయలేక పోయిన రైతులు
- అకాల వర్షాలతో ఇబ్బందులు

మోమిన్‌పేట: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు ఈ సంవత్సరం ముందస్తుగానే రుతుపవనాలు ప్రవేశించాయి. ప్రతీ సంవత్సరం జూన్‌నాటికి ప్రవేశించేవి. కానీ ఈ సారీ మే చివరికే రావడంతో రైతులకు ఆందోళన మొదలైంది. ఒకవైపు వర్షాలు, మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సరైన సమయంలో అమ్ముడుపోక దిగులు చెందుతున్నారు. కొందరు విత్తుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇంకొందరి పొలాల్లో కలుపు పెరిగి పచ్చగా మారడంతో తయారు చేసుకోలేకపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో పొలాల్లోకి ట్రాక్టర్లు పోలేని స్థితిలో ఉన్నాయి. కొందరికి ఎద్దులు లేకపోవడంతో పూర్తిగా ట్రాక్టర్లపైనే ఆధార పడటం వల్ల సమస్య ఎదురవుతున్నాయి. ఏదీ ఏమైనా ముందస్తుతో సమస్యలు తప్పవని చెబుతున్నారు. ట్రాక్టర్లు పొలాల్లోకి రాలేకపోతుండటంతో పిచ్చి మొక్కలు పెరిగి పచ్చగా మారాయి. ఎన్నడు లేనివిధంగా నెల రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఏమి చేయాలో పాలుపోవడం లేదని చెబుతున్నారు. గ్రామంలో కేవలం 20నుంచి 30మంది రైతుల వద్ద మాత్రమే ఎద్దులు ఉండటంతో వారు మాత్రమే చదునుచేశారు. మిగత రైతులు ట్రాక్టర్ల ద్వారా చదును చేసుకునేందుకు అనుకూల వాతావరణం కోసం వేచి చూస్తున్నారు. ఒక పక్క కలుపు పెరిగిపోతుండటం, మరో పక్క ట్రాక్టర్ పొలాల్లోకి దిగబడటంతో ఏమి చేయాలో తోచడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వర్షాలు కురిస్తే ఖరీఫ్‌లో రైతుల కష్టం వర్ణనాతీతం. ముందస్తు రుతుపవనాలతో ఒకవైపు సంతోషం, మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.